క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రిలో తనిఖీలు



వైద్యులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

యాదమరి: స్థానిక ప్రభుత్వాస్పత్రిని ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్ సోమవారం తనిఖీ చేశారు. రక్త పరీక్షల గదిని పరిశీలించి ల్యాబ్‌లో రోగులకు ఎలాంటి పరీక్షలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఎస్‌ఓ రమేష్‌రెడ్డి, వైద్యులు సురేఖ, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ ఉన్నారు.

అర్ధగిరి క్షేత్రంలో వేడుకగా ప్రాకారోత్సవం



ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

తవణంపల్లె: అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం ప్రాకారోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామికి సుప్రభాత సేవ, అభిషేకాలు, 9 గంటలకు వసంతోత్సవం, నివేదన, మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి పల్లకిలో కొలువైన స్వామిని ప్రాకారోత్సవం చేస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు. వసంతోత్సవంతో హనుమాన్ జయంతి వేడుకలు ముగిశాయి.

బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు ట్రాన్స్‌కో అర్బన్, రూరల్ పరిధిలో ఇద్దరు సీనియర్ సహాయకుల(ఎస్‌ఏ)కు జూనియర్ అకౌంట్ ఆఫీసర్(జేఏఓ)గా పదోన్నతి ఇచ్చారు. ఈమేరకు రూరల్ ఈఆర్వో కార్యాలయ సీనియర్ సహాయకులుగా ఉన్న ధనలక్ష్మికి పైపల్లె సబ్ ఈఆర్వో జేఏఓగా, పైపల్లె సబ్ ఈఆర్వో ఎస్‌ఏ నాగేశ్వరరావు అర్బన్ ఈఈ కార్యాలయ జేఏఓగా పదోన్నతి వచ్చింది. వీరు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



బడిఈడు పిల్లల నమోదులో ఉపాధ్యాయులు

బంగారుపాళెం: తల్లిదండ్రులు బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని బంగారుపాళెం మొయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ధనంజయరాజు అన్నారు. బంగారుపాళెంలో సోమవారం పిల్లల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించి ఒకటో తరగతిలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా కార్పొరేట్ వసతులు కల్పించడం జరుగుతోందన్నారు.

బసవాపల్లెలో వైద్యసేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కఠారి కుమార్

గుడిపాల: మండలంలోని బసవాపల్లె గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి డాక్టర్ కఠారి కుమార్ 65 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలను ఇచ్చారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రోస్‌లిన్, చంద్ర, ప్రవీణ్, కోమల, నిత్య, పంకజలు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

శాంతిపురం: కుప్పం నుంచి రేగడదిన్నేపల్లికి బైకుపై వెళ్తున్న వారిని ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. రేగడదిన్నేపల్లికి చెందిన మునినారాయణప్ప(57), మంజునాథరెడ్డి (40) సోమవారం కుప్పంలో టీడీపీ నిర్వహించిన ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్లారు. ర్యాలీ అనంతరం తిరుగు ప్రయాణంలో వీరి బైకును శాంతిపురం వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో మునినారాయణప్ప తీవ్రంగా, మంజునాథరెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని 108 ద్వారా కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ప్రమాదానికి కారణమైన కారును గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ఓంశక్తి భక్తుల అకుంఠిత దీక్ష

చిత్తూరు వాసులకు సంక్రాంతి తర్వాత వచ్చే మరో పెద్దపండుగ గంగజాతర. ఈ జాతరను మూడు రాష్ట్రాల ప్రజలు ముచ్చటైనా పండగగా భావిస్తారు. ఈ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఇక్కడి వాసులకు ఆనవాయితీ. అమ్మవారి ఆశీస్సులు, నియమావళి ప్రకారం దశాబ్దాల కాలంగా ఊరు పెద్దలు జాతరను జరిపిస్తున్నారు. ఈ తరుణంలో జాతర ముగింపు రోజు జరిగే ఓంశక్తి భక్తుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణ, ఒళ్లు గగుర్పొడిచేలా ఉంటాయి. ఈ మంగళ, బుధవారాల్లో జరిగే గంగజాతరలో ఓంశక్తి భక్తుల ప్రత్యేక విన్యాసాలు ఆకట్టుకోనున్నాయి.

- గంగజాతరలో ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు
- ఏటా పెరుగుతున్న మొక్కులు చెల్లించే భక్తుల సంఖ్య
- 17న ఓంశక్తి భక్తుల విన్యాసాలు



ఓంశక్తి భక్తుల మొక్కుల దృశ్యం

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లాలో ఓంశక్తి భక్తుల సంఖ్య ఘణనీయంగా పెరుగుతోంది. చిత్తూరులో ఒకప్పుడు పది మందితో ప్రారంభమైన ఓంశక్తి భక్తుల సంఘం ఇప్పుడు 1.50 లక్షలకు మందికి చేరింది. అమ్మవారిపై ఉన్న నమ్మకంతో భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. వీరు తమిళనాడులోని మేల్ మరవత్తూరు అమ్మవారితో పాటు గంగమ్మ తల్లిని కూడా ఎక్కువగా నమ్ముతారు. గంగమ్మ తమ కష్టాలు తీర్చే దేవత అని వీరి ప్రగాఢ విశ్వాసం. కోరికలు తీరితే వినూత్నరూపంలో మొక్కులు చెల్లించుకోవడం భక్తులకు పరిపాటిగా మారింది.

వినూత్నరీతిలో భక్తి..

చిత్తూరు నగరంలో ఏటా గంగజాతరను మే నెలలో నిర్వహించడంతో అనాదిగా వస్తోంది. ఈ జాతరలో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తే తమ కష్టాలు తొలిగి సుఖసంతోషాలతో ఉంటామని భావిస్తారు. అమ్మవారి నిమజ్జనంలో ఓంశక్తి భక్తులు మొక్కులను వినూత్నరీతిలో చెల్లించుకుంటారు. మొదట నగరంలోని ఈశ్వర గుడిలో వెలసిన శ్రీ అగస్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులను ప్రారంభిస్తారు. వీపునకు, నోటికి, ఇతర శరీర భాగాలకు శూలాలు గుచ్చుకుంటారు. అలా శూలాలు గుచ్చుకున్న భక్తులంతా చర్చివీధిలోకి వచ్చి క్యూ పాటిస్తారు. అక్కడి నుంచి ఒక్కసారిగా ఓంశక్తి భక్తుల విన్యాసాలు ప్రారంభమవుతాయి. నోటికి శూలాలు గుచ్చుకున్న వారు ర్యాలీగా వెళ్తే కొందరు లారీ, ఆటో, ట్రాక్టర్లను లాగడం, మరికొందరు వాహనాలకు వేలాడడం వంటివి వినూత్నరీతిలో విన్యాసాలు చేస్తుంటారు. కొక్కీలకు వేలాడుతూ అమ్మవారికి గజమాల సమర్పించడంతో ఓంశక్తి భక్తుల విన్యాసాలు ముగుస్తాయి. ఇందుకోసం భక్తులు 40 రోజుల పాటు ఉపవాస దీక్షలు ఉంటారు. ఈనెల 17వ తేదీన సాయంత్రం జరిగే నిమజ్జనంలో సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకు విన్యాసాలు, ఊరేగింపు అట్టహాసంగా జరుగుతాయి.

కోరిన కోర్కెలు తీర్చే తల్లి..



“ గత పదేళ్లుగా గంగమ్మకు మొక్కు చెల్లించుకుంటున్నాను. నా కుటుంబం బాగుండాలని, ఇళ్లు కట్టుకోవాలని నోటికి శూలం, వీపునకు కొక్కీలు గుచ్చుకుని అమ్మవారి ఊరేగింపునకు వెళ్తుంటాను. ఇలా నా దీక్ష ఫలించి కోరిన కోర్కెలు తీరాయి. ఈసారి కూడా దీక్షలో ఉన్నా. 17వ తేదీ జరిగే ఓంశక్తి భక్తుల ఊరేగింపులో మొక్కు. **– సాయి, భక్తుడు, చిత్తూరు**

600 మంది పైగా..



ఏటా ఓంశక్తి భక్తుల విన్యాసాలు గంగజాతరలో ప్రత్యేకం. ఈ విన్యాసాలు చేసే భక్తుల అపార నమ్మకంతో ఏటా వినూత్నరీతిలో మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈసారి 600 మందికి పైగా దీక్షలు చేపట్టారు. వీరంతా వారు అనుకున్న ప్రకారం శూలాలు, కొక్కీలు గుచ్చుకుని ఊరేగింపునకు వెళ్తారు. వారి చేసే దీక్షల ఫలితంగా గుచ్చే సమయంలో నొప్పి ఉండదు. అది అమ్మవారి కరుణ అని భావిస్తాం. **– సరిత, ఓంశక్తి భక్తుల అధ్యక్షురాలు**

ఘనంగా ఎమ్మెల్యే ఆరణి జన్మదిన వేడుకలు

- మహిళా సంఘాల సభ్యులకు 250 కుక్కర్లు పంపిణీ
- పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు
- భారీగా సేవా కార్యక్రమాలు



ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును గజమాలతో సత్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జన్మదిన వేడుకలను నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అన్నదానం చేశారు. పీసీఆర్ కళాశాలలో అపోలో ఫార్మసీ వారి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులో పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందిచారు. ఈ మెడికల్ క్యాంపును ముఖ్యఅతిథి జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు సందర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు, అభిమానుల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అనంతరం జేఎంసీ ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని డ్వాక్రా సంఘాల ఆర్పీలు 250 మందికి కుక్కర్లు మంత్రి, ఎమ్మెల్యే సతీమణి సత్యవతి, కుమారులు జగన్, మదన్, శివ చేతులమీదుగా అందజేశారు. మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్‌సురేష్, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మేయర్ అముద, కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, నాయకులు పూర్ణ, వినాయక బాలాజీ, అప్పు, శశిదీప్‌రెడ్డి, సునోజ్, త్యాగరాజన్, అమరనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, భాస్కర్, రేచర్ల ప్రవీణ్, పవన్, సాయి, రజనీకాంత్, శిరీష్‌రెడ్డి, సయ్యద్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు కుక్కర్లు అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే ఆరణి

గుడిపాలలో..

గుడిపాల: చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జన్మదిన వేడుకలు గుడిపాల మండలంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జనార్ధన్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో భారీ కేక్ కట్‌చేశారు. అనంతరం అనుపు ఎస్టీ కాలనీలో యువత అధ్యక్షుడు శిలంబరసన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, నాయకులు రజినీకాంత్, వెంకటేష్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, డానియల్, ఈశ్వర్‌రెడ్డి, కారిమేఘన్, నీల్‌రాజ్, కృష్ణమూర్తి, మోహన్, రవీంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుడిపాల: అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గర్భిణులకు వైద్యసేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

తవణంపల్లె: గర్భిణులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని.. పౌష్టికాహారంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని పుణ్యసముద్రంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేసుకోవడం సురక్షితమని పేర్కొన్నారు.

మొరంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని మొరంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ 104 వైద్య శిబిరంలో 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. వడదెబ్బకు గురికాకుండా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. సోమవారం పూతలపట్టు మండలం వడ్డేపల్లి పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డేపల్లి, బందార్లపల్లి, అమ్మగారిపల్లి, వజ్జిరెడ్డిపల్లి, కొంగర లింగరపల్లి గ్రామాల్లో పర్యటించారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల ద్వారా పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఇస్తూ పారదర్శక పాలన అందిస్తున్నారని చెప్పారు. ఇంటి ముంగిటకే సేవలు అందించేందుకు వీలుగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. అనంతరం స్థానికులు తాగునీరు, రోడ్లు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిశీలించి పరిష్కారం చూపుతామని ఆయన చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న జగనన్నను ఆశీర్వదించి 2024 ఎన్నికల్లో మరో సారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, సింగిల్ విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, పురుషోత్తం నాయుడు, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, నాయకులు బాబురెడ్డి, రాజారత్నంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వేగంగా 'స్పందన' వినతుల పరిష్కారం



స్పందన అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినతులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ అరుణ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను వేగంగా పరిష్కరించాలన్నారు. గతవారం అందిన వినతులపై సమీక్షించారు. సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో ఇంజినీరింగ్-2, టౌన్ ప్లానింగ్-2, పారిశుద్ధ్య విభాగానికి సంబంధించి ఒకటి చొప్పున మొత్తం 5 వినతులు అందాయి. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ ధనలక్ష్మి, ఎంహెచ్‌ఓ డా.లోకేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం

బంగారుపాళెం: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ బెన్నురాజ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. తుంబకుప్పం గ్రామస్తులు శ్మశాన స్థలాన్ని సర్వే చేయాలంటూ వినతి పత్రం అందజేశారు. అదే విధంగా మండలంలోని కామాక్షిపురానికి శ్మశాన స్థలం మంజూరు చేయాలని సర్పంచ్ రాజా విజ్ఞప్తి చేశారు. గామాల్లో నెలకొన్న దారి సమస్యలు పరిష్కరించాలని పలువురు గ్రామస్తులు అర్జీలు సమర్పించారు. ఆన్‌లైన్‌లో భూమికి సంబంధించిన వివరాలు నమోదు కాలేదని, ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాని వినతులు అందజేశారు. స్పందించిన తహసీల్దార్ వీఆర్‌ఓల ద్వారా విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నగర పరిధిలో డ్రాపౌట్లు ఉండకూడదు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్ : బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని, నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా డ్రాపౌట్స్ ఉండడానికి వీల్లేదని, పిల్లల తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకతను తెలియజేసి స్కూల్‌కు వెళ్లేలా చేయాలని నగర కమిషనర్ జె.అరుణ స్పష్టం చేశారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలనే అంశాలపై సోమవారం నగర పాలక కార్యాలయంలో విద్యాశాఖ, వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎస్డీజీ (సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు) సాధనలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో ఏ ఒక్క వార్డు సచివాలయ పరిధిలో కూడా బడి మానేసిన, బడికి వెళ్లని బడి ఈడు పిల్లలు ఉండరాదన్నారు. వలంటీర్లు, స్కూల్ హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లను సమన్వయం చేసుకుని వార్డు పరిధిలో ఉన్న బడి ఈడు పిల్లలందరూ పాఠశాల లేదా కళాశాలకు వెళ్తున్నారా? లేదా అనే అంశంపై క్షేత్రస్థాయిలో కచ్చితమైన సమాచారం సేకరించాలన్నారు. బాలికలను పదో తరగతికే చదువు మాన్పించకుండా, ఇంటర్‌లో చేరేలా ప్రోత్సహించాలని, అవసరమైతే సంక్షేమ శాఖల పరిధిలోని కళాశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈఓ సెల్వరాజ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతరకు విద్యుత్ కోతలు ఉండవు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు అర్బన్ డివిజన్‌లో మంగళ, బుధవారాల్లో జరిగే గంగమ్మ జాతరకు విద్యుత్ కోతలు ఉండవని ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఈఈ పద్మనాభ పిళ్లై తెలిపారు. బజారువీధి, గిరింపేట, సంతపేట, కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, దొడ్డిపల్లె, మురకంబట్టు, ఓబనపల్లె ప్రాంతాల్లో జాతర జరుగుతుందన్నారు. ఈ రెండు రోజులు లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్ చొప్పున షిఫ్టుకు ముగ్గురు, రోజూ 3 షిఫ్టుల్లో పని చేస్తారన్నారు. వీరిని పర్యవేక్షించడానికి నలుగురు ఏఈలు ఉంటారన్నారు. పీసీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్‌లో షిఫ్టులవారీగా ఉద్యోగులు పని చేస్తారన్నారు. వీరు విద్యుత్ అంతరాయం వస్తే తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపడతారన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి రాజీనామా ఆమోదం

చిత్తూరు కలెక్టరేట్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు జంగా గౌతమ్ సోమవారం ప్రకటించారు. రాజీనామా చేసిన సురేశ్‌బాబు స్థానంలో నూతన జిల్లా అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పార్టీ సీనియర్ నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నూతన అధ్యక్షుడి నియామకం వీలైనంత త్వరగా చేపడుతామని ప్రకటనలో వెల్లడించారు.

గణనాథుని సేవలో ఎమ్మెల్యేలు



ఆరణి శ్రీనివాసులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఎంఎస్ బాబు, ఆలయ ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆరణి శ్రీనివాసులు సోమవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జన్మదినం సందర్భంగా కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఆయనతో పాటు పూతలపట్టు ఎమ్మెల్యే విచ్చేయడంతో ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు.

మొగిలి శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు దోష నివారణ పూజలు చేసుకున్నారు.